అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




ఓటుకు అగ్నిపరీక్ష

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -107 బుధవారం 30 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

- పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వండి
- పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయండి
- కృష్ణా జలాల వినియోగంపై టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- మంత్రి సీఆర్ పాటిల్ తో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం




## ఖర్గే పాల్గొన్న వేదికను శుద్ధి చేయడం దారుణం

- దళితులు, ఆదివాసీలు హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: భట్టి విక్రమార్క



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** దళితులు, ఆదివాసీలపై వివక్ష, దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని భట్టి అన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా మిగతా2లో...



## మయన్మార్‌లో వైమానిక దాడి..

- అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి
- 49 మంది మృతి, 58 మందికి గాయాలు

**మయన్మార్,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యాక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతులలో మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్టూన్ ఆంగ్ మృతుల సంఖ్యను మిగతా2లో...




## తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

- గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి
- తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ వెల్లడి
- తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటన
- భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భేటీ
- వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చ

## ఏడాదిలో సొంతింటి కల సాకారం

- నగరం నడిబొడ్డున కోట్ల విలువైన స్థలాల్లో 'ఇందిరమ్మ టవర్స్'
- రూపాయి ఖర్చు లేకుండా లబ్ధిదారుల పేరిటే ఇళ్ల రిజిస్ట్రేషన్
- పేదలను నగరానికి దూరం చేయం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** ఎదవాడి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, జీవితకాలపు సొంతింటి కలను ఏడాదిలోనే సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల కష్టాలు, వారి అవసరాలను అర్థం చేసుకున్న ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత విలువైన ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను కేవలం ఆదాయ మిగతా2లో...

## నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. భారీ బహిరంగ సభలో ప్రసంగం




## ఎన్‌సీపీసీఆర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

- ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై ఆగ్రహం






## రాష్ట్ర ప్రభుత్వానిది తుగ్లక్ నిర్ణయం

సింగరేణి బొగ్గు టన్నుకు రూ.3,800..
విదేశీ బొగ్గుకు రూ.9 వేల ఖర్చు

ప్రజలపై ఈ అదనపు భారాన్ని ఎందుకు మోపుతున్నారు?

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

**హైదరాబాద్,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** టన్నుకు రూ. 3,800 ఖర్చయ్యే సింగరేణి బొగ్గును వినియోగించకుండా, టన్నుకు రూ. 9 వేల వరకు ఖర్చయ్యే విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం మరో 'తుగ్లక్' నిర్ణయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ నిర్ణయం ఎవరి ప్రయోజనం కోసం తీసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మిగతా2లో...



## నాతో పెట్టుకోవద్దు

- కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, (జర్నలిస్ట్ వార్త):** :తాను ఏ విషయమైనా నిర్దిష్టమైన ఆధారా లతోనే మాట్లాడుతానని, తనతో పెట్టుకోవద్దని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తాను ఎవరి మాటలు విని ఏది పడితే అది మాట్లాడబోనని స్పష్టం చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్న మిగతా2లో...

# తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

**న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ వార్త):** తుమ్మిడి హట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్ధక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రా లను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల)తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలో సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

వనరులుగా చూడకుండా పేదల ఆవాసాల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు.నాంపల్లి నియోజకవర్గ పరిధిలోని రెడ్‌హిల్స్‌లో మంగళవారం 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎకరం భూమి రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణానికి స్థలాలను కేటాయిస్తున్నామని చెప్పారు.రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఒక్కో అపార్ట్‌మెంట్ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు విలువ ఉంటుందని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులను ఏళ్ల తరబడి కొనసాగించకుండా ఏడాది వ్యవధిలోనే పూర్తి చేసి, ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ నగర పరిధిలోని 20 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములను గుర్తించినట్లు, ఇప్పటికే 16 నుంచి 17 ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు.మొదటి విడతలో పారదర్శకంగా నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు రెండో, మూడో, నాలుగో విడతల్లో ఇళ్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు కేవలం కాగితాలపై హామీలు ఇచ్చి వదిలేయకుండా, ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.లబ్ధిదారుల నుంచి ఎలాంటి పైరవీలు, కమిషన్లు లేకుండా ప్రభుత్వ ఖర్చుతోనే ఇళ్లను వారి పేర్లపై పక్కాగా రిజిస్ట్రేషన్ చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పిల్లల ఉన్నత విద్య, వివాహాలు, అత్యవసర వైద్య ఖర్చులు వంటి అవసరాలకు ఇంటిని ఆధారంగా చూపించి బ్యాంకుల నుంచి రుణం పొందే హక్కును కూడా పేదలకు కల్పిస్తున్నామని తెలిపారు.**నగరానికి దూరంగా ఇళ్లు నిర్మించం** గత ప్రభుత్వాల హయాంలో పేదల కోసం నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల వారి జీవనోపాధి, రోజువారీ పనులు, పిల్లల విద్యకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి పొంగులేటి విమర్శించారు. పేదల జీవన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వారు నివసించే ప్రాంతాలకు సమీపంలోనే జీ+10 విధానంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు.ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులను లబ్ధిదారులు వారానికి ఒకసారి స్వయంగా పరిశీలించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. తద్వారా నిర్మాణ నాణ్యతను వారు కూడా పర్యవేక్షించవచ్చని పేర్కొన్నారు. రెడ్‌హిల్స్ ప్రాంతంలో భవిష్యత్తులో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రధాన ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను గృహనిర్మాణ శాఖ తీసుకుంటుందని తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వానిది తుగ్లక్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

విదేశీ బొగ్గు దిగుమతికి అయ్యే అదనపు భారాన్ని తెలంగాణ ప్రజలు ఎందుకు భరించాలని ఆయన నిలదీశారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు.తెలంగాణలో భారీగా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని సింగరేణి సంస్థను పక్కనపెట్టి విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గును దిగుమతి చేసుకోవడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలోనే తెలంగాణలో అత్యధిక బొగ్గు నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు కూడా సింగరేణి సంస్థ బొగ్గును సరఫరా చేస్తోందని తెలిపారు. అలాంటి సంస్థ అందుబాటులో ఉండగా విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు.సింగరేణి బొగ్గును వినియోగించడం వల్ల రాష్ట్రానికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవచ్చని కేటీఆర్ పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో లభించే సింగరేణి బొగ్గును ఉపయోగించకుండా, దాదాపు రెండింతలకు పైగా ధర చెల్లించి విదేశీ బొగ్గును కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అదనపు వ్యయం చివరకు ప్రజలపై భారం పడే పరిస్థితి ఎందుకు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గును ఉపయోగించి టీఎస్ జెన్‌కో ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరా అందించామని కేటీఆర్ తన ప్రకటనలో గుర్తు చేశారు. సింగరేణి నుంచి బొగ్గు అందుబాటులో ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తికి విదేశీ బొగ్గుపై ఆధారపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గతంలో సాధ్యమైన విద్యుత్ సరఫరా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎందుకు సాధ్యం కావడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా విదేశీ బొగ్గు దిగుమతులకు అనుమతించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలుగుతుందని ఆయన ఆరోపించారు. తక్కువ ధరకు అందుబాటులో ఉన్న బొగ్గును వదిలి ఎక్కువ ధరకు విదేశీ బొగ్గును కొనుగోలు చేయడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.విదేశీ బొగ్గు దిగుమతుల వల్ల ఏర్పడే అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వం ఎలా భరిస్తుందో, దాని ప్రభావం విద్యుత్ వినియోగదారులపై పడుతుందా లేదా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. రాష్ట్రంలోని బొగ్గు వనరులు, సింగరేణి సంస్థ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# ఎన్‌సీపీసీఆర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** ప్రైవేటు పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఉద్దేశించిన 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కోటా అమలుకు సంబంధించిన వివరాలను సమర్పించే విషయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) వ్యవహరించిన తీరుపై ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు, ఎయిడెడ్ కాని పొరుగు పాఠశాలలు ప్రవేశ స్థాయిలో కనీసం 25 శాతం సీట్లను బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించి ఉచిత ప్రాథమిక విద్య అందించాలి. ఈ నిబంధన సమర్థంగా అమలవుతున్న తీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది.

ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్‌సీపీసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సమాచారాన్ని సేకరించడం మాత్రమే ఎన్‌సీపీసీఆర్ బాధ్యత కాదని, ప్రతి పొరుగు పాఠశాలలో ఆర్‌టీఈ నిబంధన అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని కోర్టు స్పష్టం చేసింది.ఎన్‌సీపీసీఆర్ తన అఫిడవిట్‌లో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసి ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) అమలుకు సంబంధించిన నిబం ధనల వివరాలను కోరినట్లు తెలిపింది.

అయితే తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇంకా స్పందన రాలేదని వెల్లడించింది. మిగిలిన ప్రాంతాలు అమలు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే సమాచార సేకరణతో ప్రక్రియను ముగించకుండా, చట్టం ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకురా వాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ అంశంపై తదుపరి విచారణకు ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, డైరెక్టర్ హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. ఇది ధిక్కరణ కేసు కాదని, కమిషన్‌కు అప్పగించిన బాధ్యతపై స్పష్టత కల్పించేందుకే హాజరు కావాలని కోర్టు పేర్కొంది.2026 జనవరిలోనే సుప్రీంకోర్టు ఆర్‌టీఈ చట్టంలోని 25 శాతం కోటాను సమర్థంగా అమలు చేసేందుకు అవసరమైన నియమ నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం జాతీయ స్థాయి బాధ్యతగా పేర్కొంది.

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా...

**నోరు అదుపులో పెట్టుకోకపోతే ఊరుకోబోం**

**ప్రత్యర్థులకు కొండా సురేఖ హెచ్చరికలు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

# మయన్మార్‌లో వైమానిక దాడి..

(మొదటి పేజీ తరువాయి)

ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం, వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యాక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

# నాతో పెట్టుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ వ్యాఖ్యలను కవిత తప్పుబట్టారు. అహంకారం, అక్రమ దందాలతోనే పార్టీని పాతాళానికి నెట్టారని కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు.తాను పార్టీలోని ఓ నేతపై అవినీతి ఆరోపణలు చేస్తే కొన్ని గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అదే వ్యక్తితో కలిసి ఉంటూ పార్టీ అధినేత నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ఆమె ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించిన ఫామ్‌హౌస్‌లు, అనుమతులు, ఇతర వ్యవహారాలను ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై విమర్శలు చేశారు.పార్టీలో జరిగిన వైఫల్యాలను అధినేత కేసీఆర్‌పై మోపడం సరికాదని కవిత అన్నారు. కేటీఆర్ మైండ్‌గేమ్‌ను నమ్ముతూ పార్టీకి నష్టం కలిగించవద్దని హెచ్చరించారు. గతంలో ప్రజలు, రైతులు ఎదుర్కొన్న సందర్భాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ వ్యవహారశైలిపై ఆమె విమర్శలు చేశారు.

# నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

**● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..**

**భారీ బహిరంగ సభలో ప్రసంగం**

**సిరిసిల్ల,సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు తొలిసారి వస్తున్న ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, వివిధ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం సిరిసిల్లకు చేరుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.సిరిసిల్ల పర్యటనలో సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు ఇతర నివేదికలు పేర్కొన్నాయి. నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు ఇందులో ఉన్నాయి.

# ఖర్గే పాల్గొన్న వేదికను శుద్ధి చేయడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

దళితుల రక్షణ కోసం అమల్లోకి వచ్చిన అట్రాసిటీ చట్టాన్ని ఆయన ప్రస్తావించారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్‌లో పాల్గొన్న కార్యక్రమం అనంతరం వేదికను శుద్ధి చేశారన్న అంశంపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. ఖర్గే అంచెలంచెలుగా ఎదిగి సీఎల్పీ నేతగా, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, ప్రస్తుతం ఏఐసీసీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఖర్గే పాల్గొన్న వేదికను అనంతరం శుద్ధి చేయడం దారుణమని విమర్శించారు.దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన కలుగుతోందని భట్టి ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ రక్షణ, సమానత్వం కల్పించేందుకు దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్‌లో ఖర్గే సమావేశం అనంతరం జరిగిన పరిణామాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్పందించకపోవడం ప్రశ్నలకు తావిస్తోందని అన్నారు. దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, సమానత్వం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

# తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

**ఫ్రాంక్‌ఫర్ట్, సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్ లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ లో ఈ బృందం పర్యటించనుంది. వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్ గారు, శాసన మండలి చైర్మన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుంది. సెప్టెంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ జరిగింది. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది. విదేశీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధి బృందం ఆయా దేశాల పార్లమెంట్లను సందర్శించి, అక్కడి పార్లమెంటరీ విధానాలను పరిశీలిస్తుంది.

# కేసముద్రంలో ఘనంగా పోషణ మాసం

## మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన అవసరం





**కేసముద్రం/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్‌పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసంలో భాగంగా మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలో పోషకాహారంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలని, వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను మహిళలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ కె. కమలాదేవి, ఈ. రాజమణి, జే. లలిత, కవిత, రమాదేవి, సుజాత, ఆయాలు అరుణ, చంద్రకళ, సరోజన, భవ్యశ్రీతో పాటు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం వృద్ధులకు చీరలు, పంచెల పంపిణీ





**వైరా/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** సిరిపురం గ్రామానికి చెందిన కందిబండ బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి శైలజారాణి ఆధ్వర్యంలో మంగళవారం మధిరలోని ఆదరణ సేవా ఫౌండేషన్‌లో వృద్ధులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలకు చీరలు, వృద్ధులకు పంచెలు, అరటిపండ్లు, పులిహోరతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శైలజారాణి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన కుమారులు రాజేష్, రాకేష్ సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమం నిర్వహించిన శైలజారాణిని పలువురు అభినందించారు.

కార్యక్రమంలో సోషల్ వర్కర్ లతీఫ్, హరికృష్ణ, అక్కిణమ్మతో పాటు ఆదరణ సేవా ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఖాజీపేటలో రైల్వే కార్మికుల ఆందోళన

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** రైల్వే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఖాజీపేట టూల్‌రూమ్స్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఇంజినీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఇల్లందుల రాజేందర్ నేతృత్వంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

**పెండింగ్ బకాయిలు చెల్లించాలి**

రైల్వేలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులపై అదనపు పనిభారం తగ్గించాలని, సురక్షిత పని వాతావరణం కల్పించాలని రాజేందర్ డిమాండ్ చేశారు. ట్రాక్ మెయింటెనెన్స్ గస్తీ పరిధిని 12 కిలోమీటర్లకు పరిమితం చేయాలని, కీమన్‌లకు అప్పగిస్తున్న అదనపు విధులను ఉపసంహరించాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు కొత్త అసిస్టెంట్లకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటీఏ, టీఏ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పిల్లల విద్యా అలవెన్సులను వెంటనే చెల్లించాలని కోరారు.

సౌకర్యాలు కల్పించాలి

రాత్రి గస్తీకి ఇద్దరు పెట్రోల్‌మెన్‌లను నియమించాలని, అర్హులకు జీడీసీఈ, ఎల్‌డీసీఈ, ఏవీసీ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పరీక్షలను నిర్వహించి పదోన్నతుల కోసం సీబీటీ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రైల్వే ఆసుపత్రుల్లో సిబ్బందిని పెంచాలని, ట్రాక్ మెయింటెనెన్స్ సిబ్బంది, లోకో పైలట్లకు యూనిఫామ్ కిట్లు, వాటర్ బాటిళ్లు అందించాలని కోరారు. పీఎల్‌బీపై ఉన్న రూ.7 వేల పరిమితిని తొలగించి వాస్తవ వేతనాల ఆధారంగా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మరింత విస్తృత ఉద్యమం చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో చైర్మన్ కొంగర బిక్షపతి, అసిస్టెంట్ సెక్రెటరీ కరుణాచారి, నరసింహస్వామి, పాశం దేవయ్య, భాస్కర్, గౌతమ్, శివ, రషీద్, సమ్మయ్య, రాజయ్య, రాజకుమార్, వెంకటస్వామి, రజినీకాంత్‌తో పాటు పలువురు కార్మికులు, మహిళా కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఉనికి కోసమే రాజయ్య అసత్య ఆరోపణలు

## ఇప్పగూడెం సర్పంచ్ మందపురం రాణి అనిల్‌గౌడ్



**స్టేషన్‌ఘన్‌పూర్/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఇందిరమ్మ ఇళ్లపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఇప్పగూడెం సర్పంచ్ మందపురం రాణి అనిల్‌గౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు. అవినీతి జరిగిందని ఆధారాలు ఉంటే లబ్ధిదారుల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇప్పగూడెం గ్రామానికి ఎన్ని ఇళ్లు మంజూరు చేశారో రాజయ్య వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో గ్రామానికి 94 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. రూ.2.30 కోట్లతో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో మరో నలుగురు అర్హులకు ఇళ్లు మంజూరు కాలేదని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సమస్య పరిష్కారమైన వెంటనే వారికి కూడా ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని రాజయ్యకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తుల మల్లయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి -అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి




**తల్లాడ/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి సెలవులో ఉండటంతో ఎంపీడీవో అధ్యక్షతన సమావేశం జరిగింది. సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గోపాలపేట, నరసింహారావుపేట అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని గోపాలపేట సర్పంచ్ తాళ్ల సుధారాణి కోరారు. కులాంతర వివాహాలు చేసుకున్న దళితులకు స్వయం ఉపాధి కోసం రూ.2.50 లక్షల ప్రోత్సాహకం, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించే పథకాలు ఉన్నాయని ఎస్సీ సంక్షేమశాఖ సహాయ అధికారి ఎం.వీరన్న తెలిపారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని తల్లాడ సర్పంచ్ కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో 103 నిర్మాణాలను గృహప్రవేశాల స్థాయికి తీసుకురావాలని సర్పంచులు, కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. సమావేశంలో వైద్య, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సంఘం అధ్యక్షురాలిగా మాడుగుల కవిత

## ఉపాధ్యక్షురాలిగా కాడరీ రేవతి ఎన్నిక





**ఎల్కతుర్తి/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం ఇంద్రానగర్ గ్రామంలోని మహిళా వీఓ డీఆర్డీఏ స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహిళా సంఘాల ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా మాడుగుల కవిత, ఉపాధ్యక్షురాలిగా కాడరీ రేవతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్యదర్శిగా కోరే సునీతతో పాటు సభ్యులుగా అంబాల స్వప్న, అంబాల భాగ్యలను ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘాల సభ్యులు, మండల అధికారులు, ఏపీఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

# సప్పిడుగుట్టలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## రూ.50 లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు



**కేసముద్రం/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండలం సప్పిడుగుట్ట గ్రామపంచాయతీలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు బద్రునాయక్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, కేసముద్రం సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్న అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేస్తోందన్నారు. పాత తరహా కాగితపు కార్డులకు బదులు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్డుల్లో కుటుంబ వివరాలు నిక్షిప్తమై ఉంటాయని, ఓటీపీ ఆధారంగా రేషన్ పంపిణీ జరుగుతుందని చెప్పారు. స్మార్ట్ కార్డులను రేషన్ డీలర్లు లేదా ఇతరుల వద్ద ఉంచకుండా లబ్ధిదారులే భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ చొరవతో సప్పిడుగుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని మాన్సింగ్ తండా, జంగమయబోడు తండా, సప్పిడుగుట్ట తండాల్లో దీర్ఘకాలంగా ఉన్న వీధిలైట్ల సమస్య పరిష్కారమైందన్నారు. అవసరమైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలతో పాటు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షల అభివృద్ధి నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. గిరిజనుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజలు ఐక్యంగా ఉండి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోతు రవినాయక్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# కేసముద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం దగ్ధం

## బీజేపీ ఆధ్వర్యంలో నిరసన..

## వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్



**కేసముద్రం/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లను అవమానించేలా, ఉత్తరదక్షిణ విభేదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కేసముద్రం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక జ్యోతిరావు పూలే సెంటర్‌లో సీఎం చిత్రపటాన్ని దగ్ధం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ న్యూఢిల్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపించారు. శ్రీరాముడు ధనికులకు, శివుడు పేదలకు అంటూ దేవుళ్ల మధ్య కూడా విభజన తీసుకురావడం సరికాదన్నారు. ఓట్ల రాజకీయాల కోసం సమాజాన్ని విభజించేలా వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు ఓలం శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పూర్ణఘటి భాస్కర్, జుజ్జూరు వీరభద్రచారి, బానోత్ సంపత్, కాటం వెంకట్‌రెడ్డి, నగేష్ నాయక్, బానోత్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో 2-బీ బార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

## రూ.30 లక్షల వార్షిక ఎక్సైజ్ పన్ను స్లాబ్..

## అక్టోబర్ 12 వరకు గడువు

**కేసముద్రం/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా 2-బీ బార్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి. కరంచంద్ తెలిపారు. ప్రభుత్వ, ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. బార్‌కు వార్షిక ఎక్సైజ్ పన్ను స్లాబ్‌ను రూ.30 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

దరఖాస్తులను సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 12 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. అక్టోబరు 16న ఉదయం 11 గంటలకు మహబూబాబాద్ ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ ద్వారా ఎంపిక నిర్వహిస్తారు. దరఖాస్తులను హైదరాబాద్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం, వరంగల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయాల్లో సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు రూ.లక్ష నాన్ రిఫండబుల్ చలాన్ లేదా డీడీ, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డుల స్వయంసాక్ష్య ప్రతులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలను తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కరంచంద్ కోరారు.

# విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

**వినియోగదారులు అధికారులకు సహకరించాలి**



**స్టేషన్‌ఘన్‌పూర్/ సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):**
విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆపరేషన్ డీఈ బి.సారయ్య, టౌన్ సబ్‌ఇంజినీర్ బి.హరిత కోరారు. మంగళవారం ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో విద్యుత్ బకాయిలు ఉన్న సర్వీసుల వివరాలను అధికారులు పరిశీలించారు. అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి మహమ్మద్ యాఖూబ్ పాషాతో కలిసి పెండింగ్ బిల్లుల వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వినియోగదారులు పెండింగ్ విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో వినియోగదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు వాసం శ్రీధర్, అన్వర్ పాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యం

**ప్రజాస్వామ్య వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారని జ్ఞానేశ్‌కుమార్‌పై ఆరోపణలు**

**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్**

**పరకాల/సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):**
అమరవీరుడు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి పాలకుల నిరంకుశ పోకడల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ పరకాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దామెర కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థల స్వయంప్రతిపత్తి దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు నిష్పాక్షికంగా




వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరిస్తున్న తీరు పక్షపాతంగా ఉందని, ఏకపక్ష నిర్ణయాలతో ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల నిర్వహణ, విధివిధానాలకు సంబంధించిన నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా వ్యవస్థలు పనిచేయాలని అన్నారు. స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జ్ఞానేశ్‌కుమార్ ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దామెర కిరణ్ డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థి, యువతపై కూడా ఉందన్నారు. విద్యార్థులు చైతన్యవంతులై రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెమినార్‌లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, మండల కార్యదర్శి సాయి తేజ, పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, పట్టణ కార్యదర్శి అఫ్రోజ్, పట్టణ గర్ల్స్ కన్వీనర్ శ్రీ వర్ష, శాయంపేట మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, మండల ఉపాధ్యక్షుడు రాహుల్, పట్టణ ఉపాధ్యక్షుడు వినీత్ సన్నీతో పాటు విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొన్నారు.

# ఉగ్గంపల్లి పీహెచ్‌సీలో డీహెచ్ ఆకస్మిక తనిఖీ

**వైద్య సేవలు, మందుల నిల్వలపై పరిశీలన**



**మహబూబాబాద్/సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ ప్రజారోగ్య వైద్య సంచాలకులు (డీహెచ్) డాక్టర్ రవీంద్ర నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ల్యాబొరేటరీ సేవలు, మందుల నిల్వలు, రోగులకు మందుల పంపిణీ వివరాలను పరిశీలించారు.
గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రోత్సాహం, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించి, మహబూబాబాద్ జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉగ్గంపల్లి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, మరిపెడ వైద్యాధికారి డాక్టర్ రవి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# మూడు నెలలుగా పట్టించుకోని మున్సిపాలిటీ సిబ్బంది

**మురుగు కాలువలు, వీధి కుక్కలతో ప్రజల అవస్థలు**

**ప్రజారోగ్యంతో చెలగాటం ఆపాలి: డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లె ప్రవీణ్**

**హసన్పర్తి/సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా పల్వేల్పులలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో పారిశుధ్య సమస్యలను మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లె ప్రవీణ్ విమర్శించారు.
డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కాలనీలో సర్వే నిర్వహించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు, మూడు నెలలుగా మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల బెడద తీవ్రంగా పెరిగిందని



స్థానికులు తెలిపారు. అపరిశుభ్రత కారణంగా ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని ప్రవీణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ పారిశుధ్య నిర్వహణపై ఎందుకు చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా నిర్లక్ష్యం కొనసాగించడం సరికాదన్నారు.
కాలనీలో వీధి కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందని, సుమారు 40 వరకు కుక్కలు సంచరిస్తున్నాయని తెలిపారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కాలనీ ప్రజలను సమీకరించి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని పల్లె ప్రవీణ్ హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కుంచాల రమణ, రత్న, రూబెన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ స్టడీస్ బోధనలో నాణ్యత పెంచాలి

**విద్యార్థుల్లో సామాజిక అవగాహన, బాధ్యతాయుత పౌరసత్వం పెంపొందించాలి**



**కేసముద్రం/సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):**
సాంఘిక శాస్త్ర బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించి విద్యార్థుల్లో సామాజిక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, బాధ్యతాయుత పౌరసత్వ లక్షణాలను పెంపొందించాలని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం తాల్లపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సోషల్ స్టడీస్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠ్యాంశాలను విద్యార్థుల దైనందిన జీవితానికి అనుసంధానిస్తూ మ్యాప్స్, చార్ట్స్, ప్రాజెక్టులు, స్థానిక ఉదాహరణలు, డిజిటల్ వనరులతో బోధించాలని తెలిపారు. అభ్యసన సామర్థ్యాలను నిరంతరం అంచనా వేసి లోపాలను గుర్తించి పరిష్కార బోధన చేపట్టాలని, పదో తరగతి ఫలితాల మెరుగుదలకు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వివిధ అంశాలపై వారి పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్ఓ అప్పారావు, హెచ్ఎం కోట కనకయ్య, దేశబోయిన వెంకన్న, సాంఘిక శాస్త్ర ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# భూములు పోయాయి.. పరిహారం ఏదీ?

**గౌరవెల్లి కాలువకు భూములిచ్చిన రైతుల ఎదురుచూపులు**

**మల్లారం, వంగరలో పెండింగ్ భూములను పరిశీలించిన ఆర్డీవో**

**భీమదేవరపల్లి/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలువురు రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేసినప్పటికీ.. మల్లారం, వంగర గ్రామ శివార్లలోని కొన్ని భూములకు ఇంకా పరిహారం అందలేదు. భూములు కోల్పోయి పరిహారం కోసం వేచిచూస్తున్న రైతుల పరిస్థితిపై అధికారులు దృష్టిసారించారు. హనుమకొండ ఆర్డీవో ఎన్. వెంకటేశ్ మంగళవారం ఆయా గ్రామ శివార్లలోని గౌరవెల్లి కాలువ పరిధి భూములను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న భూములకు త్వరలోనే నష్టపరిహారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు ఇక జాప్యం లేకుండా పరిహారం అందించాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. ఆర్డీవో వెంట తహసీల్దార్ బి.రాజేష్, ఈఈ స్వామి, డీఈ చైతన్య తదితరులు ఉన్నారు.

# కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి

**నియోజకవర్గ పరిస్థితులపై త్వరలోనే సమీక్ష**



**నర్సంపేట/ సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):**
దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణానంతరం ఆయన సతీమణి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆమె కుటుంబ యోగక్షేమాలను, పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి, పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తానని కేటీఆర్ తెలిపినట్లు స్వప్న సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాంలు, షూస్, బెల్టుల పంపిణీ



**తల్లాడ/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, షూస్, బెల్టులను కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచ్ కృష్ణవేణి మంగళవారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంలో భాగంగా అమలు చేస్తున్న పథకాల ద్వారా వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామని, తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మురుగునీటి గుంటలు, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో జేసీబీలతో కాల్వలు తవ్వించి సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జోసెఫ్, గ్రామ కార్యదర్శి సాయికుమార్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కిషోర్, గ్రామ పెద్దలు సామినేని రామారావు, నరసింహారావు, రాందాస్, నాగుల మేరతో పాటు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫతేపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లానాయక్**






**స్టేషన్ ఘన్‌పూర్/ సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):**
చిల్పూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో మంగళవారం హైదరాబాదు సూరారం మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లానాయక్ ప్రారంభించారు. డాక్టర్లు శ్రీలేఖ, తన్మయి, రోహిణి ఆధ్వర్యంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ యాజమాన్యం, నిర్వాహకులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో క్యాంప్ ఆర్గనైజర్ వెంకట్, ఫార్మసిస్ట్ హారిక, ఉపసర్పంచ్ గుగులోత్ రంగమ్మ, కారోబార్ గుగులోత్ రతన్‌సింగ్, హాస్పిటల్ వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎస్ఈఈయూ-327 క్రియాశీలక పాత్ర

## వన్ మినిట్ రూల్ తప్పక పాటించాలి




**స్టేషన్‌ఘన్‌పూర్ /సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎస్ఈఈయూ-327 క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎన్‌పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో డీఈ బి.సారయ్యను మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా ఎన్నికైన టీఎస్ఈఈయూ-327 డివిజన్ కార్యవర్గాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా డీఈ సారయ్య నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. సంఘాలకు అతీతంగా సంస్థ అభివృద్ధికి నిష్పక్షపాతంగా పనిచేయాలని, ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీఎండీ కర్ణాటి వరుణ్‌రెడ్డి ప్రవేశపెట్టిన వన్ మినిట్ రూల్‌ను కచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, టీఎస్ఈఈయూ నాయకులు, నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్త వహించాలి

## ఎల్కతుర్తి జాతీయ రహదారిపై మూడు ప్రమాద ప్రాంతాల గుర్తింపు



**ఎల్కతుర్తి/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** ప్రమాదాల నివారణకు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారులు మంగళవారం సందర్శించారు. అనంతరం వరంగల ̄కరీంనగర్‌సిద్దిపేట జాతీయ రహదారిని పరిశీలించి ప్రమాదాలు జరిగే మూడు ప్రాంతాలను గుర్తించారు. మద్యం, నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ దారా కవిత, అదనపు ఎస్పీ రాయల ప్రభాకర్‌రావు, ఆర్‌అండ్‌బీ, ఆర్టీవో, ఎన్‌హెచ్ అధికారులు, స్థానిక సీఐ శ్రీను, ఎస్ఐ నర్సింహారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# దళిత, గిరిజన మహిళలకు కుట్టు మిషన్లు ఎక్కడ?

## 100 శాతం సబ్సిడీతో వెంటనే పంపిణీ చేయాలి



**భీమదేవరపల్లి/సెప్టెంబర్ 29( జర్నలిస్ట్ వార్త):**
ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు. నిరుపేద దళిత, గిరిజన మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఉచితంగా కుట్టు మిషన్లు అందించే ప్రత్యేక పథకాన్ని వెంటనే ప్రకటించాలని కోరారు.
బీసీ మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లు అందిస్తున్నప్పుడు ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి కుటుంబ ఆదాయాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించాలని కోరారు. అవసరమైతే కేబినెట్‌లో ప్రత్యేకంగా చర్చించి ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం ప్రత్యేక కుట్టు మిషన్ పథకాన్ని ప్రకటించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున ప్రకాష్ డిమాండ్ చేశారు

# ఢిల్లీలో 'సెల్ఫ్ రెస్పెక్ట్' ప్రోగ్రామ్.

-రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ అధిష్టానానికి సంఘీభావం ఎమ్మెల్యే కోరం కనకయ్య,సర్పంచ్ ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/,సెప్టెంబర్ 29.(జర్నలిస్ట్ వార్త)**
ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,ఆయన కుటుంబంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు,రాజకీయ ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పూర్తి స్థాయి మద్దతు ప్రకటించేందుకు ఆత్మాభిమాన,సెల్ఫ్ రెస్పెక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని ఆయన ఢిల్లీ నివాసంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశంలో ఇల్లందు శాసనసభ్యుడు కోరం కనకయ్య,కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై జరుగుతున్న ఆరోపణలను తిప్పికొడుతూ,కాంగ్రెస్ నాయకత్వానికి అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో నాయకులు స్పష్టం చేశారు.బహుజన, దళిత నాయకత్వంపై కుట్రపూరితంగా చేస్తున్న రాజకీయ దాడులను ఖండిస్తూ,పార్టీ ఆత్మాభిమానాన్ని కాపాడుకునేందుకు నియోజకవర్గ స్థాయి నుండి బలంగా నిలబడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# మహిళా కమిషన్ సభ్యురాలిని కలిసిన హెచ్ఆర్సీసీఐ ప్రతినిధులు

**ఖమ్మం/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** భర్త వేధింపులపై బందు రజిత ఇచ్చిన ఫిర్యాదుపై న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయిని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (హెచ్ఆర్సీసీఐ) ఖమ్మం జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్ కుమార్ మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని మహిళా కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు వివరాలను సభ్యురాలి దృష్టికి తీసుకెళ్లి, బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు బందు రజితతో పాటు ఇరుకుల లక్ష్మి, తవ్వల జైపాల్ పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌లో సృజనాత్మక పోటీలు

## నరేంద్ర మోదీ నేటి భారతం పై విద్యార్థుల ప్రతిభ





**నర్సంపేట/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):**
ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, స్పీచ్ పోటీలు నిర్వహించారు. బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సేవా సంకల్ప్ అభియాన్ వరంగల్ జిల్లా కన్వీనర్ డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నరేంద్ర మోదీనేటి భారతం అంశంపై విద్యార్థులు తమ చిత్రాలు, ప్రసంగాల ద్వారా ప్రతిభను చాటారు. మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, చంద్రయాన్ విజయాలు, యువతకు లభిస్తున్న అవకాశాలను చిత్రాల్లో ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా డా. రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశం గురించి ఆలోచించాలని, చదువుతో పాటు సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.
కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాశికంటి రమేష్, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్, సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంకిసా విఘ్నేష్ గౌడ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు విజయ్ సింగ్, నాగేంద్రబాబు, ముత్యాల శ్రీనివాస్, పోనుగోటి రవీంద్రచారి, చేను నరేష్, అజీమ్ పాషా, రాజు, కొంద్రా తరుణ్ సాయి, సంగెపు తేజా, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ హాస్టల్‌లో ఇదేం దుస్థితి!

## ఒక్క వర్కర్‌తోనే నిర్వహణ.. అరటి పండ్లు, పెరుగు కోసం విద్యార్థుల పరుగులు

## విరిగిన బాత్‌రూమ్ తలుపులు.. దోమల స్వైరవిహారం.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం





**పర్వతగిరి/ సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండలంలోని ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో ఒక్క వర్కర్‌తోనే హాస్టల్ నిర్వహణ సాగుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. నిత్యావసరాల్లో భాగమైన అరటి పండ్లు, పెరుగు తెచ్చుకునేందుకు కూడా కిలోమీటరుకు పైగా నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
హాస్టల్‌లోని బాత్‌రూమ్ తలుపులు సగానికి పైగా విరిగిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యార్థులు వాపోతున్నారు. దోమల బెడదతో రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కలెక్టర్ రెండుసార్లు హాస్టల్‌ను సందర్శించినా, స్పెషల్ ఆఫీసర్, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని విద్యార్థులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.
ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, తగిన సిబ్బందిని నియమించడంతో పాటు బాత్‌రూమ్ తలుపులు, పారిశుధ్యం, దోమల నివారణ చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

# మీ ఇష్టం.. చెప్పుకోండి!

## క్వారీలు.. క్రషర్లపై తనిఖీలెన్ని? అనుమతులెన్ని? -కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్







**వరంగల్/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):**
క్వారీలు, క్రషర్ల నిర్వహణ.. అనుమతులు.. తనిఖీలు.. ఉల్లంఘనలపై చర్యలు వంటి అంశాల్లో స్పష్టమైన సమాచారం కోరుతున్న ప్రజలకు మైనింగ్ శాఖ అధికారుల నుంచి నిర్లక్ష్యపూరిత సమాధానాలు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాకు స్పెషల్ ఆఫీసర్ డ్యూటీ ఉంది. నేను బిజీగా ఉన్నాను. కాగితంపై వివరాలు రాసి ఇచ్చి వెళ్లండి. మేమే ఫోన్ చేసి పిలుస్తాం.. అప్పటివరకు ఆఫీసుకు రావొద్దు అంటూ కొందరికి అధికారులు చెప్పినట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. మరికొందరికి మీ ఇష్టం వచ్చినట్లు రాసుకోండి అని సమాధానం ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు.

**తనిఖీల లెక్కలేవీ?**

జిల్లాలో ఎన్ని క్వారీలు, క్రషర్లు అనుమతులతో కొనసాగుతున్నాయి? ఎన్ని అనుమతులు పునరుద్ధరించారు? గడువు ముగిసిన వాటిపై ఏం చర్యలు తీసుకున్నారు? గత రెండేళ్లలో ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఉల్లంఘనలు ఎన్ని గుర్తించారు? నోటీసులు, జరిమానాలు, కేసులు, ఇతర చర్యల వివరాలేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**పని నివేదికలపై ప్రశ్నలు**

అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు, తనిఖీ నివేదికలు, ఫిర్యాదుల పరిశీలన, అనుమతుల పరిశీలన తదితర అంశాల్లో శాఖ వద్ద ఉన్న రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారా అనే దానిపైనా స్పష్టత రావాల్సి ఉంది. సహజ వనరులు, ప్రభుత్వ ఆదాయానికి సంబంధించిన వ్యవహారాల్లో పారదర్శకత అవసరమని పలువురు కోరుతున్నారు.
మైనింగ్ శాఖ అధికారుల తీరుపై వస్తున్న ఆరోపణలను జిల్లా కలెక్టర్ పరిశీలించి, అధికారుల వివరణతో పాటు అనుమతులు, తనిఖీ నివేదికలు, ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్లక్ష్యపు సమాధానం చెప్పకుండా కార్యాలయానికి వస్తున్న వారికి కనీస సమాధానం చెప్పేవిధంగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు

# యాకూబ్‌కు పేరెంట్స్ కమిటీ ఆత్మీయ పరామర్శ



**పర్వతగిరి/ సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):** అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన సీనియర్ పేరెంట్స్ కమిటీ సభ్యుడు చిర్ర యాకూబ్ కోలుకుని తిరిగి పేరెంట్స్ సమావేశానికి హాజరుకావడంతో కమిటీ సభ్యులు ఆత్మీయంగా పరామర్శించారు. ఆయనకు ధైర్యం కల్పిస్తూ ఆపిల్, దానిమ్మ పండ్లు అందించి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల కుమార్, స్వప్న, గోపాల్, కరుణాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం







స్పెషల్ ఆఫీసర్ తో సమస్యలు చెబుతున్న పేరెంట్స్ కమిటీ.

## డీసీఓ ఎం. నీరజ

**పర్వతగిరి/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన వసతులు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని జిల్లా ప్రత్యేక అధికారి, డీసీఓ ఎం. నీరజ అన్నారు. పర్వతగిరి పీఎం శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ జ్యోత్స్న ఆధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, చదువుతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించాలని సూచించారు.
ప్రిన్సిపాల్ జ్యోత్స్న మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల అవసరాలు, వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు.
పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరుకుడు స్వప్న మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనపై అధికారుల దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లినట్లు తెలిపారు. పిల్లల చదువుతోపాటు వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.
వైస్ చైర్మన్ జోష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అవసరమైన మౌలిక వసతులు నిరంతరం అందేలా పర్యవేక్షించాలని కోరారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీ భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న అవసరాలను గుర్తించి దశలవారీగా పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, సభ్యులు ఐలపాక స్వప్న, పసునూరి శ్రీవిద్య, జన్ను కుమార్, మేకరి మల్కార్జున్, నరకుడు రవీందర్, కొంకపాక రమేష్, మమత, యాకయ్య, సింగారపు గోపాల్, చిర్ర యాకూబ్, బిర్రు కరుణాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు అగ్నిపరీక్ష




న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉండే విశ్వాసమే అత్యంత కీలకం. ఓటరు తన ఓటు విలువైనదని, తన పేరు ఓటర్ల జాబితాలో సురక్షితంగా ఉందని, తాను ఎవరికి ఓటు వేసినా ఆ ఓటు నిష్పక్షపాతంగా లెక్కించబడుతుందని నమ్మినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం బలపడుతుంది. ఈ విశ్వాసానికి ఎన్నికల సంఘం ప్రధాన సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది. అయితే ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వరుసగా అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న నివేదికలు తాజాగా చర్చకు దారితీశాయి. **ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు** ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధనను ఉటంకిస్తూ మన తెలంగాణ సంపాదకీయం తెలిపిన వివరాల ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై అధికారిక అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు-పునరుద్ధరణ, ఫామ్-6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, డేటా కేంద్రీకరణ వంటి ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై ఈ అభ్యంతరాలు ఉన్నట్లు సంపాదకీయం పేర్కొంది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండానే జరిగాయని కమిషనర్లు పేర్కొన్నట్లు నివేదికలో వచ్చిన అంశాలను కూడా సంపాదకీయం ప్రస్తావించింది. అయితే ఎన్నికల సంఘం దీనిపై భిన్నమైన వివరణ ఇచ్చింది. అంతర్గత చర్చల్లో అభిప్రాయ భేదాలు సహజమేనని, తుది నిర్ణయాలు పూర్తి కమిషన్ ఏకగ్రీవంగానే తీసుకుందని ఎన్నికల సంఘం పేర్కొన్నట్లు సంపాదకీయం తెలిపింది. **సీఈసీ ఒక్కరే కాదు** రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, దిశానిర్దేశం, నియంత్రణ అధికారాలు ఎన్నికల సంఘానికి అప్పగించబడ్డాయి. ప్రస్తుతం ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్ వ్యవస్థ అమల్లో ఉంది. నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకోవడానికి ప్రయత్నం చేయాల్సి ఉన్నప్పటికీ, విభేదాలు తలెత్తిన సందర్భంలో మెజారిటీ నిర్ణయం అమలవుతుంది. అందువల్ల ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు కీలక పాత్ర ఉన్నప్పటికీ, ఆయన ఒక్కరే ఎన్నికల సంఘం కాదని సంపాదకీయం పేర్కొంది. ఇద్దరు కమిషనర్లు వరుసగా అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాన్ని వ్యక్తిగత విభేదంగా కాకుండా, రాజ్యాంగ సంస్థలో నిర్ణయాలు ఎంత పారదర్శకంగా జరుగుతున్నాయన్న దృష్టితో చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. **రాజ్యాంగ నైతికతకు ప్రాధాన్యం** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కేవలం చట్టాల పుస్తకంగా కాకుండా, రాజ్యాంగ సంస్థలను నిర్వహించే వ్యక్తులు దాని స్ఫూర్తి, పరిమితులు, నైతికతను గౌరవించినప్పుడే అది సమర్థంగా పనిచేస్తుందని భావించినట్లు సంపాదకీయం పేర్కొంది. ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించడం రాజ్యాంగ విరుద్ధం కాదని, అదే సమయంలో ఎన్నికల సంఘం తనపై వచ్చే ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని సంపాదకీయం అభిప్రాయపడింది. ఎందుకంటే ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉండే నమ్మకమే ఎన్నికల ఫలితాలకు నైతిక బలాన్ని ఇస్తుంది. **గెలుపు కంటే ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం ముఖ్యం** భారత తొలి సాధారణ ఎన్నికల సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యలను కూడా సంపాదకీయం ప్రస్తావించింది. ఎన్నికల్లో గెలుపు, ఓటమి కంటే గెలిచిన తీరు, ఓడిన తీరు ముఖ్యమనే భావనను ముందుకు తెచ్చింది. ఒక రాజకీయ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించడం మాత్రమే ప్రజాస్వామ్యానికి కొలమానం కాదని, ఆ విజయం నిష్పక్షపాత ఎన్నికల ద్వారా లభించిందనే నమ్మకం ప్రజల్లో ఉండటం కూడా అంతే ముఖ్యమని సంపాదకీయం పేర్కొంది. అదే విధంగా ఓడిపోయిన పార్టీ కూడా ఎన్నికల ప్రక్రియ న్యాయంగా జరిగిందని అంగీకరించగలగడం ప్రజాస్వామ్య బలానికి సూచికగా పేర్కొంది. **ఓటర్ల జాబితాపై ఆందోళనలు** ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం అవసరమే అయినప్పటికీ, ఈ ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును అన్యాయంగా కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని సంపాదకీయం పేర్కొంది. బీహార్‌లో ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అనంతరం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించినట్లు పేర్కొంటూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధన ప్రకారం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడ్డాయని సంపాదకీయం తెలిపింది. అయితే ఈ సంఖ్యలు, ప్రక్రియకు సంబంధించిన వివాదాలు రాజకీయ మరియు న్యాయ చర్చల్లో ఉన్న అంశాలని గుర్తించాల్సి ఉంటుంది. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, న్యాయపరమైన సందేహాలు ఉన్న లక్షలాది ఓటర్ల అంశాన్ని పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సంపాదకీయం పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో వివిధ రాజకీయ వర్గాల నుంచి ఎన్నికల సంఘంపై పలు డిమాండ్లు వచ్చినట్లు కూడా తెలిపింది. **తెలంగాణలో 75 లక్షల ఫారాల అంశం** ఓటర్ల జాబితా విషయంలో తెలంగాణకు సంబంధించిన అంశాన్ని కూడా సంపాదకీయం ప్రస్తావించింది. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడించిన సమాచారాన్ని ఉటంకిస్తూ సుమారు 75 లక్షల ఫారాలు సమర్పించని అంశాన్ని పేర్కొంది. అయితే దీన్ని 75 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని అర్థం చేసుకోకూడదని స్పష్టం చేసింది. అదే సమయంలో ఇంత పెద్ద సంఖ్యలో ఫారాలు సమర్పించకపోవడం ప్రజాస్వామ్యపరంగా ప్రశ్నలను లేవనెత్తుతోందని పేర్కొంది. సంబంధిత ఓటర్లలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది జాబితాలో ఉందని ఎలా నిర్ధారిస్తారన్నది కీలక ప్రశ్నగా నిలుస్తుందని తెలిపింది. **సుప్రీంకోర్టుకు చేరిన వివాదం** ఎన్నికల సంఘం పనితీరుకు సంబంధించిన వివాదం సుప్రీంకోర్టు దృష్టికి కూడా వెళ్లింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌లో, ఇతర ఇద్దరు కమిషనర్ల సమ్మతి లేకుండా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్న నిర్ణయాలు, ఫామ్-6 మార్పులు, ఎన్నికల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలపై స్వతంత్ర దర్యాప్తు కోరినట్లు సంపాదకీయం పేర్కొంది. అలాగే కోట్లాది పేర్ల తొలగింపుపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని పిటిషన్‌లో కోరినట్లు తెలిపింది. ఇవి ప్రస్తుతం ఆరోపణలు, న్యాయపరమైన పరిశీలన దశలో ఉన్న అంశాలు మాత్రమేనని, ఆరోపణలు నిర్ధారితమైనవిగా పరిగణించరాదని కూడా స్పష్టం చేయాల్సి ఉంటుంది. **నియామక విధానంపై చర్చ** ఎన్నికల సంఘం సభ్యుల నియామక విధానంపైనా మరోసారి జాతీయ స్థాయిలో చర్చ అవసరమని సంపాదకీయం పేర్కొంది. 2023లో రూపొందించిన చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల ఎంపికలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీకి పాత్ర ఉంది.

# తాతయ్యలు.. అమ్మమ్మలతో ఆత్మీయత



**వర్ధన్నపేట/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** పిల్లలు, వయోవృద్ధుల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని బలోపేతం చేయాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బండౌతపురం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులతో ఆమె ముచ్చటించారు. వారి అనుభవాలు భావితరాలకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పిల్లలు, యువత వయోవృద్ధులను గౌరవిస్తూ ఆప్యాయంగా మెలగాలని సూచించారు. చిన్నారులు, వృద్ధులతో ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు ప్రేమ, గౌరవం, భద్రత, వైద్య సహాయం అందించడం కుటుంబ బాధ్యత అన్నారు. సహాయం, సమాచారం కోసం 14567 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వయోవృద్ధుల గౌరవప్రద జీవనానికి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరేందర్, అంగన్వాడీ టీచర్లు వజ్రమ్మ, బుజ్జమ్మ, ఆయా సుశీల, చిన్నారులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు

## పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 29 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి సూచించారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణంలోని జాతీయ రహదారి పరిధిలోని పలు ప్రాంతాలను వారు పరిశీలించారు. రహదారి మార్జిన్లను ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, దుకాణాలు, షెడ్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదాల ముప్పు పెరుగుతోందని గుర్తించారు. నిబంధనల మేరకు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించి సహకరించాలని కోరారు. పట్టణ ప్రజల భద్రతకు పోలీసు, మున్సిపల్, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఇక్కడున్నది మోదీ-చంద్రబాబు-పవన్ అని గుర్తుంచుకోవాలి

## స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే విజయం ఖాయమన్న చంద్రబాబు



కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే, మరికొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించే ప్రసక్తి లేదని, ఇక్కడ ఉన్నది మోదీ, చంద్రబాబు, పవన్ అని గుర్తుంచుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రత్యర్థులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విధ్వంసానికి, నేటి కూటమి ప్రభుత్వ వికాసానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించిన 'పల్లె పండుగ-3.0' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, తన అనుభవం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని, ప్రస్తుతం ఆ ప్రజాదరణ మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిదే ఘనవిజయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కనీస సౌకర్యాల కల్పనకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. గత ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మిస్తే, తమ ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లను నిర్మించిందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం, ఖాళీ ఖజానా ఉన్నప్పటికీ, 'సూపర్ సిక్స్' వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.